ఉత్కంఠభరితంగా క్రీడాపోటీలు

జగ్గయ్యపేట అర్బన్: ఆడుదాం ఆంధ్రా పేరుతో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడలు నిర్వహిస్తూ, క్రీడారంగ అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ కొనియాడారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్రా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈక్రీడా పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రేక్షకులు తరలిచ్చి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో వారు మాట్లాడుతూ ప్రతిభ ఉండి గుర్తింపులేని క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా చేయడమే లక్ష్యంగా సీఎం జగనన్న ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మేకా రమేష్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన విజేతలు ఈనెల 31న విజయవాడలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో సైతం విజేతలుగా నిలచి జగ్గయ్యపేట నియోజకవర్గానికి మరింత పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, నాయకులు బద్దునాయక్, కాశికిషోర్, దువ్వల రామకృష్ణ, డేవిడ్, పూసల పుల్లారావు, పీడీలు ఎం.శ్రీనివాసరావు, గంటా వెంకటేశ్వర్లు, ఎం.సావుడానాయక్, సరోజ, సునీత, నాగేశ్వరరావు, ఫిలిప్, కృష్ణ, మణిరత్నం పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

పేట నియోజకవర్గస్థాయి పురుషుల విభాగం కబడ్డీ పోటీల్లో చిల్లకల్లు జట్టు విజేతగా నిలువగా, రన్నర్స్‌గా వత్సవాయి జట్టు నిలిచింది. మహిళా విభాగం కబడ్డీలో మంగోలు జట్టు గెలుపొందగా, సోమవరం(నందిగామ)జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్ పురుషుల విభాగం పోటీల్లో జగ్గయ్యపేట కొలిమిబజారు జట్టు గెలుపొందగా, వత్సవాయి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. మహిళా విభాగంలో వత్సవాయి జట్టు విన్నర్‌గా నిలువగా, పెనుగంచిప్రోలు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఖోఖో మహిళా విభాగం పోటీల్లో చిల్లకల్లు జట్టు విజేతలుగా నిలువగా, వత్సవాయి మండల జట్టు రన్నర్స్‌గా నిలిచింది.


పురుషుల కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న చిల్లకల్లు, వత్సవాయి జట్లు


మహిళా కబడ్డీ విజేత మంగొల్లు జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు


పురుషుల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన చిల్లకల్లు జట్టు


మహిళా కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు


బహుమతి అందుకుంటున్న పేట కొలిమిబజారు వాలీబాల్ జట్టు

క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు బహూకరణ

భీమవరం(వత్సవాయి) : స్థానిక ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ జానీ శనివారం మధ్యాహ్న భోజన ప్లేట్లను బహూకరించారు. తనతండ్రి షేక్ ఖాసిం జ్ఞాపకార్థం పాఠశాలలోని 100మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి కారుపాటి మాధురి మాట్లాడుతూ విద్యార్థులకు ప్లేట్లను అందించిన ఉపాధ్యాయుడు జానీని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అజ్మీరు కొండ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి, మాజీ సర్పంచి భీమాల సుజాత, ఎస్‌కే వలీ, ఆషాబీ, షబియా బేగం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయని అనిగండ్లపాడు సర్పంచి బి.జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు పేర్కొన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మానాన్న సోషల్ సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, అనాధలకు శనివారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమంటూ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ కవి, టీచర్ దోసపాటి నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు కనకపూడి బాబూరావు, సీపీఎం నాయకుడు వల్లపుదాసు గురవయ్య, ఫౌండేషన్ వ్యవస్థాపకులు డోర్నాల నాగయ్య, దైదా దానయ్య పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని సుబ్బాయిగూడెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పి.ఇందిర, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని 200మందికి వైద్యపరీక్షలు చేశారు. మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి సునీల్‌కుమార్, శ్రీతిరుపతమ్మ ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పేటలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక బి కన్వెన్షన్‌లో జరుగుతుందని కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ సమావేశానికి విజయవాడ ఎంపీ కేశినేని నాని, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అదేరోజున రూ.15కోట్లతో జగ్గయ్యపేట పట్టణం, వత్సవాయిలో పూర్తయిన సెంట్రల్ లైటింగ్, గ్రామసచివాలయం, ఆర్బీకే, మంచినీటి పైపులైన్, సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులను వారు ప్రారంభిస్తారని వివరించారు. కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రావు, రాష్ట్ర మైనార్టీసెల్ జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, బద్దూ నాయక్, నంబూరి రవి, పూసల పుల్లారావు, డేవిడ్, ఖాదర్ బాబు, సాయిచైతన్య శర్మ, దువ్వల రామకృష్ణ , గుంజ లక్ష్మణ్, జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

నందిగామ: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నందిగామ రవాణాశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో ఎం.పద్మావతి, కార్యాలయ సిబ్బంది, డ్రైవింగ్ స్కూళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలిసి శనివారం జగ్గయ్యపేటలో ర్యాలీ నిర్వహించారు. పేట ప్రాంతీయ రవాణాశాఖాధికారి రవికుమార్, ట్రాఫిక్ ఎస్సై ఆర్.శ్రీనివాసరావు, వాగ్దేవి, జీఆర్సీ కళాశాల సిబ్బంది ఆలాం, విద్యార్థులు పాల్గొన్నారు.

సువర్ణ ప్రాసనతో ఎన్నో ప్రయోజనాలు

వీరులపాడు: మండలంలోని నరసింహారావు పాలెంలో శనివారం పుష్యమి నక్షత్రం సందర్భంగా చిత్తూరు జిల్లా మంగళంపేట గ్రామానికి చెందిన గోవనం ట్రస్ట్ సహకారంతో చిన్నారులకు ఉచిత సువర్ణ ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవనం ట్రస్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ సువర్ణప్రాసన అంటే బంగారంతో చేసిన చూర్ణమన్నారు. ఇందులో తేనె, నెయ్యి, శతావరి, అశ్వగంధ మూలికలుంటాయని, పుష్యమి నక్షత్రం రోజున ద్రవాన్ని తీసుకుంటే గొప్ప ప్రయోజనాలున్నాయని వివరించారు. 200 మంది చిన్నారులకు ద్రవాన్ని బిందు రూపంలో అందజేశారు. సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ట్రస్ట్ వలంటీర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

డొంక రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


డొంకరోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): గ్రామీణ ప్రాంతాల్లో డొంకరోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని విభరింతలపాడులో రూ.5లక్షలతో చేపట్టిన డొంకరోడ్డు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పొలాలకు రాకపోకలు సాగించేందుకు రైతులు ఇబ్బందిపడుతున్న విషయం తనదృష్టికి రావడంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. గ్రామాల్లో అన్ని మౌలికవసతులను కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

పునీత శౌరి ఆలయానికి శంకుస్థాపన..

మండలంలోని విభరింతలపాడులో చేపట్టిన పునీత శౌరి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీను, రెవ. ఫాదర్ మెవ్వల ప్రసాద్, బాపట్ల మధుబాబు, మంచాల చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు ప్రభుత్వం పరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థానిక సామినేని విశ్వనాధం కార్మికనగర్‌లోని పట్టణ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలకు ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా థామస్ ఆల్వాఎడిసన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విప్ ఉదయభాను మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి వెలుగును ప్రసాదించిన థామస్ ఆల్వా ఎడిసన్‌ను ఎలక్ట్రికల్ వర్కర్లు స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పేట ఎలక్ట్రికల్ వర్కర్స్ కొత్తగా కార్యాలయాన్ని నిర్మించుకుని వేడుకలు ఘనంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. తాను ఎల్లవేలలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నందున ఎలక్ట్రీషియన్స్ అందరికీ చేతినిండా పనులు చేతినిండా ఉంటాయని, అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని 11 కార్మికసంఘాల కార్యాలయాల కోసం స్థలాన్ని కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇళ్లులేని ఎలక్ట్రీషియన్లంతా వెంటనే జగనన్న కాలనీల్లో స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే, స్థలం కేటాయించడంతోపాటు ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశానికి ఎలక్ట్రీషియన్స్ యూనియన్ గౌరవ సలహాదారు కొండూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్(బాజీ), శ్రీనివాసగౌడ్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బజారు సాయి, బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్, ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇనపనుర్తి యోహాను, కోనేరు సత్యనారాయణ, కోశాధికారి మత్స ప్రసాద్, గౌరవాధ్యక్షుడు గుడిపూడి కృష్ణమూర్తి, భానుప్రకాష్, సహాయ కార్యదర్శులు శ్రీనివాసాచారి, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను


ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎలక్ట్రిషియన్లకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి థామస్ అల్వా ఎడిసన్‌తోపాటు పలువురి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ పడుతున్న ఇబ్బందులు, సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ విద్యుత్ తీగలపై ప్రాణాలను గుప్పిట పెట్టుకుని జీవనం సాగిస్తున్న కష్టజీవులని గుర్తుచేశారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్‌కు కూడా ప్రభుత్వం అండగా ఉండటంతోపాటు వారి అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఎలక్ట్రీషియన్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, అసోసియేషన్ నాయకులు కొండ, ఆనంద్, సురేష్, కరీముల్లా, రజాక్, నాయకులు, ఎలక్ట్రీషియన్స్ పాల్గొన్నారు.

పెద్దదిక్కుగా ఉండి తోడ్పాటునివ్వండి

ఎంపీ కేశినేని నానికి ఎమ్మెల్యే విజ్ఞప్తి

నందిగామ టౌన్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో గెలిచాక నందిగామ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) తనవంతు సహకారం అందించాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో శనివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం, దివంగత మున్సిపల్ చైర్మన్ మండవ వరలక్ష్మి చిత్రపటానికి ఎంపీ కేశినేని నానితో కలిసి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామను ప్రత్యేకంగా చూడటంతో పాటు తమకు పెద్ద దిక్కుగా ఉండి తమకు తోడ్పాటునందించాలని ఎంపీ కేశినేని నానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించి, పక్కచూపు చూడకుండా ప్రయాణం చేసి తమను వారి భుజస్కంధాలపై మోశారంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉండటంతోపాటు వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరి కొండారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, కోటేరు లక్ష్మి, గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, వేల్పుల ప్రశాంతి, విజయవాడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గోగుల రమణ, పార్టీ మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, ఆవుల రమేష్‌బాబు, కందుల నాగేశ్వరరావు, వేమా సురేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ

అవార్డు గ్రహీతలకు ఘనసత్కారం

వత్సవాయి : విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వత్సవాయి మండలానికి చెందిన ఆయాశాఖల అధికారులను శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మండల ఆర్‌అండ్‌బీ ఏఈ నరేంద్ర, వత్సవాయి పంచాయతీ ఈవో ఇమామ్‌సాహెబ్, హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావు, ఎంఈవో ఎల్.నాగరాజులను ఎంపీపీ కొలుసు రమాదేవి, ఎంపీడీవో రమేష్ బాబు ఘనంగా సత్కరించారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు..

అంతకుముందు నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కొలుసు రమాదేవి మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావు, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, విద్యాశాఖాధికారి ఎల్.నాగరాజు ,పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఈవోపీఆర్డీ మాధవి, వత్సవాయి పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, వత్సవాయి సర్పంచి భూక్యా సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను, భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డుగ్రహీతలను సన్మానిస్తున్న ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో రమేష్‌బాబు తదితరులు

సీఎం దృష్టికి ఎలక్ట్రీషియన్ల సమస్యలు : ఎమ్మెల్సీ

కంచికచర్ల : కార్మికుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద కంచికచర్ల, వీరులపాడు మండలాల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ డేను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అరుణకుమార్, ముందుగా థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎలక్ట్రీషన్ల సమస్యలు సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎలక్ట్రీషన్లు ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు.

ప్రతిభచూపిన అమ్రితసాయి విద్యార్థులు

కంచికచర్ల : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సుతార్‌లాండ్ గ్లోబస్ సర్వీసెస్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 13మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు చెప్పారు. ఎంపికై నవారికి వార్షిక వేతనం రూ.3లక్షలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, బి.రామారావు డి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.




నందిగామ రూరల్ సీఐగా చంద్రశేఖర్



కంచికచర్ల : నందిగామ రూరల్ సర్కిల్ సీఐగా పి.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీఐగా పని చేసిన ఐవీ నాగేంద్రకుమార్ విజయవాడ స్పెషల్ బ్రాంచికి బదిలీ కాగా, విజయవాడ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్ నందిగామ సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాదం కలిగిస్తే ఎటువంటి వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు


కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న పేట తహశీల్దార్ సూర్యారావు


అవార్డు తీసుకుంటున్న శివాజీ , వైద్యాధికారి రత్నప్రియదర్శిని, కానిస్టేబుల్ గడ్డల రాంబాబు

జగ్గయ్యపేట : విధుల్లో అంకితభావంతో పనిచేసిన అధికారులకు గుర్తింపుగా ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు, బుదవాడ గ్రామ సచివాలయ కార్యదర్శి బి.శివాజీ ఎంపిక కాగా, వీరికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసాపత్రాలను అందజేశారు. పురస్కారాలను అందుకున్న సూర్యారావు, శివాజీలను రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది అభినందించారు.


ఉత్తమ వైద్యాధికారిగా వై.రత్నప్రియదర్శిని..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఉత్తమ ప్రతిభా పురస్కారానికి అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని ఎంపికయ్యారు. డాక్టర్ రత్నప్రియదర్శిని సేవలకు గుర్తింపుగా గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆమెకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆమెను అభినందించారు.

ఉత్తమ కానిస్టేబుల్‌గా గడ్డల రాంబాబు..

కంచికచర్ల : కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గడ్డల రాంబాబును ఉత్తమ కానిస్టేబుల్ అవార్డుకు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా రాంబాబు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అవార్డుగ్రహీత గడ్డల రాంబాబును కంచికచర్ల ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌ఐ మంగ్యానాయక్, పోలీసులు అభినందించారు.

ప్రారంభానికి సిద్ధంగా సెంట్రల్ లైటింగ్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట–చిల్లకల్లు నాలుగు లేన్ల రోడ్డులో రూ.కోటితో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఈనెల 29న ఎంపీ కేశినేని నాని ప్రారంభించనున్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 5 కిలోమీటర్ల మేర 111 స్తంభాలకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నందిగామ: మహిళ అదృశ్యమైన ఘటనపై నందిగామ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని డీవీఆర్ కాలనీకి చెందిన కరీమా అనే వివాహిత ఈనెల 24వ తేదీన ఇంటికి అవసరమైన నిత్యవసరాలు తీసుకుని వచ్చేందుకు బయటకు వచ్చిం, ఇంటికి తిరిగి చేరలేదు. ఆమె కోసం వెతికినా కనిపించకపోవడంతో ఆమెభర్త షేక్ అహ్మద్ నందిగామ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.